క్లుప్తంగా

మంద కృష్ణకు శుభాకాంక్షలు



కృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు

యాచారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ కమిటీ యాచారం మండలం ఆధ్వర్యంలో ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ నాయకత్వంలో మంద కృష్ణ మాదిగను కలిశారు. ఈ నెల 7న జరిగే లక్ష డప్పుల కార్యక్రమంలో మాదిగ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ కమిటీ సభ్యులు తొట్ల యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సత్కారం



సంకటోనిపల్లిలో మాజీ కౌన్సిలర్ రాధమ్మ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మను సంకటోనిపల్లి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఐదేళ్లు కౌన్సిలర్‌గా వార్డు అభివృద్ధికి, సంకటోనిపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేశారని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు నిరంజన్, రామలింగయ్య, బాలరాజు, మహేశ్, మల్లేశ్, శేఖర్, చంద్రయ్య, యాదగిరి, రాజు, ఆచారి, నరేశ్, యాదయ్య, నర్సింహ, వెంకటయ్య, లాలయ్య పాల్గొన్నారు.

క్రీడలతో సమాజంలో గుర్తింపు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

యాచారం: క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిగూడెంలో ఆదివారం ఏపీఎల్ సీజన్–5 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... క్రీడలతో మంచి గుర్తింపు వస్తుందని, సెలవు రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న యువతను మరింత ప్రోత్సహించడానికి కావాల్సిన క్రీడా మైదానాలను నిర్మించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు బాలశివుడు, జయప్రకాశ్, వెంకట్‌రెడ్డి, భరత్‌రెడ్డి, లింగం, శేఖర్, కార్తీక్, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

9 నుంచి వేణుగోపాలస్వామి జాతర

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు ఆరుట్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీరాల రమేశ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఎల్లేశ్, చంద్రయ్య, భాస్కర్, రాములు, బాషా, రఘుపతి, మాసయ్య, సురేష్, జానీ పాషా, రాజు, కుమార్, కృష్ణ, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం

షాద్‌నగర్‌రూరల్: వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని మల్లికార్జున కాలనీలో గల శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నేడు(సోమవారం) సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు వీరేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు పాఠశాల ఆవరణలో ఉదయం 9:45 గంటలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్షరాభ్యాసం చేయించేవారు కిలో బియ్యం, కొబ్బరికాయ, పూజా సామగ్రి, పూల దండ, పండ్లు, విస్తరాకు, గ్లాసు, తమలపాకులు తీసుకురావాలని సూచించారు. చిన్నారితో పాటుగా తల్లితండ్రులు సాంప్రదాయ దుస్తులతో సమయానికి విచ్చేసి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిథిల భవనం.. పాలనే కష్టం

- కూలేందుకు సిద్ధంగా పంచాయతీ కార్యాలయాలు
- కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్న వైనం
- కనీస సదుపాయాలు లేక సిబ్బంది ఇక్కట్లు



ధర్మన్నగూడెంలో ఐదేళ్లుగా కమ్యూనిటీ భవనంలోనే కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

యాచారం: గ్రామాలకు గుండెకాయల్లాంటి పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్ల కింద నిర్మించిన భవనాల్లోనే ప్రతేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాలన కొనసాగిస్తున్నారు. ఈ భవనాలు ఎప్పుడు కూలుతాయో.. తెలియక బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేవలం యాచారం, మాల్, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, కుర్మిద్ద, కొత్తపల్లి, నానక్‌నగర్, గునుగల్, నల్లవెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో మినహా మిగతా గ్రామాల్లో ఏళ్ల కింద నిర్మించిన భవనాలే ఉన్నాయి. ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీలతో గుర్తింపు పొందిన తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో కూడా ఏళ్ల కింద నిర్మించిన భవనాల్లోనే పాలన కొనసాగుతుంది.

పేరుకే కొత్త పంచాయతీలు

మండలంలో ఐదేళ్ల కింద అప్పటి బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అయ్యవారిగూడెం, కేసీతండా, తక్కళ్లపల్లి తండా, ధర్మన్నగూడెం గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. వీటికి ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాల, కమ్యూనిటీ భవనాల్లో పంచాయతీలు ఏర్పాటు పరిపాలన కొనసాగిస్తున్నారు. ఐదేళ్లుగా కొత్త గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని అప్పటి ప్రజాప్రతినిధులు జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్లకు విన్నవించినా ఫలితం లేకపోయింది. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ భవనాల్లోనే పాలన కొనసాగిస్తున్నారు.

మరుగుదొడ్లు లేక నరకయాతన

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సగానికి పైగా తాగునీటి సౌకర్యం లేని భవనాలు ఉన్నాయి. అందులో మరుగుదొడ్లు, మూత్రశాలలు సైతం లేవు. కొన్నేళ్ల కింద నిర్మించిన ఈ భవనాల్లో అప్పుడే మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలనే నిబంధనల ఉన్నప్పటికి అప్పటి పాలకులు త్వరగా భవనాలు పూర్తి కావాలనే ఉద్దేశంతో ప్రారంభించడంతో నేటికి సౌకర్యాలు లేవు. గ్రామ పంచాయతీల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఆకస్మిక తనిఖీలకు వచ్చిన అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీల కేంద్రంగా సేవలు అందించే పంచాయతీ కార్యదర్శులతో పాటు, రెవెన్యూ సిబ్బంది, ఐకేపీ, ఈజీఎస్ తదితర శాఖల సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఏళ్ల క్రితం నిర్మాణం



మంతన్‌గౌరెల్లిలో ఏళ్ల కింద నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలు కురిస్తే గదుల్లోకి నీళ్లు వస్తాయి. సమావేశాలు ఏర్పాటు చేసే అవకాశం ఉండడం లేదు. గతంలో పలుమార్లు నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించాం. ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటాం.

– జ్యోతినాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, మంతన్‌గౌరెల్లి

ఫార్మాసిటీతో ప్రసిద్ధి



ఫార్మాసిటీకి తాడిపర్తి గ్రామంలోని వందలాది ఎకరాల అసైన్డ్, పట్టా భూములను తీసుకున్నారు. అప్పట్లోనే గ్రామంలో నూతన గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు చేయాలని టీజీఐఐసీ అధికారులను కోరాం. కానీ ఫలితం లేకపోయింది. శిథిలావస్థలో ఉన్న భవనంలోనే గ్రామ పంచాయతీ పరిపాలన కొనసాగుతుంది.

– రమేశ్, మాజీ సర్పంచ్, తాడిపర్తి

సౌకర్యాల కల్పనకు కృషి



గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు అడగలేదు. సిఫార్సులు రాగానే శిథిలావస్థకు చేరుకున్న గ్రామ పంచాయతీ భవనాల జాబితాను సిద్ధం చేసి పై అధికారులకు నివేదిక రూపంలో అందజేస్తాం. అన్ని గ్రామ పంచాయతీల్లో సౌకర్యాలు ఉండేలా నా వంతుగా కృషి చేస్తా.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, యాచారం

ఆదిబట్లలో మెగా జాబ్‌మేళా



మేళాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఫాక్స్‌కాన్ ప్రతినిధులు, గోపాల్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ చెప్పారు. ఆదివారం మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో బహుళజాతి కంపెనీ అయినా ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగాల ఎంపిక కోసం ఆయన జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మంది నిరుద్యోగులు మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో చదువుకొని ఉపాధి అవకాశాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే ముందు స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరామని తెలిపారు. టీసీఎస్, ఫాక్స్‌కాన్, ఏరోస్పేస్‌తో పాటు ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ సిబ్బంది శ్రీకాంత్, వినయ్, సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

మంచాల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని వీఆర్‌వన్ ఫౌండేషన్ అధినేత కుకుడాల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లపల్లిగూడలో గతంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 15 మందికి ఆపరేషన్లు చేయగా, 100 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఆదివారం ఈ మేరకు వారికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఎస్.కె.భిక్షపతి, బాలరాజు, నరేందర్, గ్రామస్తులు నర్సింహ, రాములు, మల్లయ్య, రాజేందర్‌రెడ్డి, మల్లేశ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల సీఐగా వేణుగోపాలరావు



మాడ్గుల: మాడ్గుల సీఐగా వేణుగోపాలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన జగదీష్ ఇబ్రహీంపట్నానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వేణుగోపాలరావు స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్ఐలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా సత్కరించారు.

రోడ్డును ఆక్రమించిన దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్..

తుర్కయంజాల్: రోడ్డుపైనే వ్యాపారాలు వాహనదారుల ఇబ్బందులు అంటూ సాక్షిలో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి స్పందించారు. ఆదివారం సాగర్ రహదారి మాసబ్ చెరువు కట్టపై ఇంజాపూర్ నుంచి గుర్రంగూడ వరకు షెడ్‌లు వేసి ఏర్పాటు చేసిన 9 దుకాణాలను తొలగించారు. సోమవారం మరిన్ని దుకాణాలను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. చాలా మంది వ్యాపారులు షెడ్‌లను ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి కోరారని ఆయన గుర్తుచేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. మూడేళ్లుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి సరిగా నిధులు రావడం లేదని ఆరోపించారు. రాష్ట్రాలకు జనాభా నిష్పత్తిలో నిధులు కేటాయించాలని కోరినా కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు నిధులు కేటాయించి రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, నాయకులు ఖాదర్, ఖరీం, కృష్ణనాయక్, అలీం, ఫరీద్, నాజర్, మహేశ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో ముందుండాలి



క్రీడాకారులకు టోపీలు అందజేస్తున్న రాంరెడ్డి

మంచాల: యువత క్రీడోత్సవాల్లో ముందుండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కుకుడాల రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జాపాల గ్రామంలో జేపీఎల్ క్రికెట్ లీగ్‌ను నిర్వహించారు. కామ్రేడ్ ఈశ్వరప్ప జ్ఞాపకార్థం టోపీలు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ మల్లప్ప, నాయకులు యాదయ్య, జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

బడా బాబుల కోసమే బడ్జెట్



ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లిలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న సీపీఎం నేతలు

- సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు
- పలు ప్రాంతాల్లో కేంద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం రూరల్: కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడటానికే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గరాములు ఆరోపించారు. బడ్జెట్ సామాన్యులకు ఆశాజనకంగా లేదని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో సాగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బుగ్గరాములు మాట్లాడుతూ.. బడ్జెట్ భారత బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులు అనుమతిస్తూ.. దేశీయ బీమా సంస్థల ఉనికి ప్రమాదంలో పడేసేలా ఉందన్నారు. విద్య, వైద్యానికి 3 శాతం నిధులు కేటాయించడం సరైంది కాదన్నారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసమే నిధుల కోత విధించారని మండిపడ్డారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్న నిధులు తీసుకురాని అసమర్థులన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు జంగయ్య, ఎల్లేశ్, నర్సింహ, పురుషోత్తం, వీరేశం, స్వప్న, యాదగిరి, వంశీ, తరంగ్, చరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోల్కంపల్లిలో...

కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండలంలోని పోల్కంపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకుడు పి.జగన్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద సంవత్సరానికి రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం.. బడ్జెట్‌లో అందుకు నిధులు కేటాయించలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరి నర్సింహ, గ్రామ కార్యదర్శి అమనగంటి నర్సింహ, నాయకులు అశోక్, యాదయ్య, స్వామి, జంగయ్య, ఇస్తారి, వెంకటేష్, బాల్‌రాజ్, లక్ష్మణ్, శివ, జంగయ్య పాల్గొన్నారు.

సంపన్న వర్గాలకే అనుకూలం



తుర్కయంజాల్: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్ ఆరోపించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ ఆదివారం తుర్కయంజాల్ అంబేడ్కర్ చౌరస్తాలో పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే రైతులు, కార్మిక వర్గాలను పూర్తిగా విస్మరించారని, విద్యా, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, నిరుద్యోగ యువత, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాలకు తూట్లు పొడిచారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదం, శారద, శంకరయ్య, శ్రీనివాసులు, కృష్ణ పాల్గొన్నారు.

నిధులు కేటాయించకపోవడం అన్యాయం

మంచాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి.. నేడు బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, బాలరాజ్, సంజీవ, దర్శన్, వెంకన్న, యాదయ్య, రవి పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శెట్టిపల్లిలో స్వామివారి సేవలో గ్రామస్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 5 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటిరోజు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణం, ధ్వజారోహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మక్తమాదారంలో..

కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండోరోజు ఆదివారం హోమం, ధ్వజారోహనం, బేరిపూజ, దేవత ఆహ్వానం, పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించేవరకు పోరు



ఆమనగల్లు: కడ్తాలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్
- 'వేల గొంతులు–లక్ష డప్పులు' వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం రూరల్: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీల్లో ఏబీసీడీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం ఆపేది లేదని బీజేపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టబోయే వేల గొంతులు లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సోదరులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డప్పు సప్పుడుకు ప్రభుత్వాలు దిగొచ్చి వర్గీకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సతీష్, నాయకులు మహేశ్, సుధాకర్, ఉద్యోగ సంఘాల నాయకులు అయోధ్య, యాదయ్య, మల్లేశ్, బాబు, నర్సింహ, బాలరాజ్, జంగయ్య, అమరేందర్, నరేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మహాప్రదర్శన విజయవంతం చేయాలి

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో నిర్వహించే 'వేలగొంతులు లక్ష డప్పులు' మహాప్రదర్శనను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడురి లక్ష్మీనర్సింహారెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్, మండల శాఖ అధ్యక్షుడు రమేశ్ కోరారు. ఆదివారం కడ్తాల మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాప్రదర్శన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణను దేశంలో అందరికంటే ముందుగా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, దానికి కట్టుబడి వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, లక్ష్మయ్య, లాయక్‌అలీ, పాండునాయక్, శ్రీకాంత్, నరేశ్, అశోక్, ముత్తికృష్ణ, కుమార్, జగన్, మహేశ్, అశోక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ఆలయంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈనెల 8 నుంచి 14 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లను నిర్వాహకులు, స్థానిక నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, బిచ్చానాయక్, రామకృష్ణ, వెంకటేశ్, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, చందోజీ, సాయిరెడ్డి, వెంకటయ్య, బుచ్చయ్య, యాదయ్య, ఈఓ మోహన్‌రావ్‌లు ఆవిష్కరించారు. ఉత్సవాలలో భాగంగా 8న అంకురార్పణ, ధ్వజారోహనం, 9న అమ్మవారికి ప్రత్యేకపూజలు, లలితా సహస్రనామ పారాయణం, స్వామివారికి ఎదుర్కోలు, 10న చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, 11న లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు, హోమం, 14న చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.